# పాదుక కృత్ అనే ధూమకేతువు

దక్షిణ భారతంలో అంతగా ప్రసిద్ధి పొందని ఒక కుగ్రామంలో జోతిష్య పండితుడుగా, దేవీ ఉపాసకుడిగా అతి ప్రశస్త్యుడైన వ్యక్తి బృహస్పతి శాస్త్రి. ఆయన ఏదైనా చెప్తే చెప్పినట్లే జరుగుతుంది. ఫలానా రోజు సూర్యుడు పడమర ఉదయిస్తాడన్న ప్రవచనం శాస్త్రినోటినుండి జారిపడటం అంటూ జరిగితే, ఆరోజు సాయంత్రం అయిదుగంటల తొమ్మిది నిమిషాలవరకూ కారుమేఘాల మరుగున దాక్కున్న ఆ దొంగ భాస్కరుడు అయిదుగంటల తొమ్మిది నిమిషాల మూడు సెకన్లకు తన తళతళలాడే బట్టతలను బయటకు చూపిస్తాడు. రాత్రి తర్వాత తొలిసారి సూర్యుణ్ణి చూసేటప్పుడేగదా సూర్యోదయం? పడమటికి చేరేవరకు మనకంటికి సూర్యుడు కనిపించనప్పుడూ సూర్యోదయం పడమట జరిగినట్లేకదా! ఆ విధంగా బృహస్పతి శాస్త్రిగారి భవిష్యత్‌వాణి ఎప్పుడూ పొల్లుపోదు. ఈ సంఘటనను ఆసరాగా తీసుకొని బృహస్పతి శాస్త్రి దేవతలతో కయ్యానికి కాలుదువ్వుతాడని భావించకండి. సూర్య చంద్రాదులను, అష్ట గ్రహాలను, అష్టదిక్పాలకులను సతతం ఆరాధించే మహాభక్తుడు శాస్త్రి. పురాతన కాలంలో తన భర్తకు రాబోయే విపత్తును నివారించటానికి పతివ్రతా శిరోమణియైన సుమతి సూర్యోదయాన్నే స్తంభింప చేసిందట! దీని అర్థం ఆనాడూ సూర్యుడు కారుమేఘాల చాటున కనపడకుండా ఉండిపోయాడనా? లేక భూమి తన నిరంతర పరిభ్రమణ ప్రక్రియను అక్షం మీద కొద్దిసేపు ఆపుచేసిందనా?

పరంపరా గతంగా ఈ జ్యోతిష్యశాస్త్రాన్ని నూరితాగిన వాళ్ళు శాస్త్రి పూర్వీకులు. బృహస్పతి శాస్త్రి తండ్రి జాతకం ప్రకారంగా తన ఏకైక పుత్రుడు మహాపండితునిగా,

పరమభక్తునిగా శోభిస్తాడని వెల్లడైంది. వేరే జ్యోతిష్యశాస్త్ర ఉద్దండ పండితులుగూడా ఈ విధంగానే చెప్పటం జరిగింది.

ఈ పుత్రుడు జన్మించేటప్పుడు, అంటే సూర్యోదయానికి మూడుగడియల ముందు, తూర్పు దిక్చక్రంలో అప్పటివరకూ కన్పించని పసుపు, ఎరుపు, నీలం రంగులతో ఒక కాంతి పుంజం కొద్ది నిమిషాలపాటు వెలుగులు జిమ్మిందట. సమీపంలోని ఒక పవిత్ర దేవాలయంనుండి అదే సమయంలో శంఖ నాదం విన్పించిందట. సూర్యోదయం అయిన వెంటనే ఆ ఇంటిపై నుండి, కంఠంమీద తెలుపు రంగుగల విష్ణుగరుడపక్షి మూడు సార్లు పరిభ్రమించి అదృశ్యమైందట! పుట్టినవెంటనే ఏడవటానికిబదులుగా ఈ పాపడు నవ్వుతూ చుట్టూ పరికించాడట! ఆ నవజాత శిశువు తలపై ఒక్క రోమంగూడా లేదట. ఆ పుత్రుణ్ణి చూసిన తండ్రికి పళని సుబ్రహ్మణ్యస్వామిని దర్శించిన అనుభూతి కలిగి, రెండు చేతులూ పైకెత్తి నమస్కరిస్తూ ఆనందా శ్రువులు రాల్చాడట!

ఆ పిల్లవానికి సాటి పిల్లలకు మల్లేసాధారణ విద్యాభ్యాసం చేయిస్తున్నప్పటికీ, సంస్కృత భాషలో ప్రత్యేక శిక్షణ ఇవ్వటానికి ఒక పండితుడు స్వయంగా ముందుకు వచ్చాడట! అనతి కాలంలోనే ఆ బాలుడు సంస్కృతంలో ఆశ్చర్యకరమైన ప్రావీణ్యం సంపాదించాడు. మామూలు విద్యాభ్యాసంలో సైతం సమర్థుడైన ఆవిద్యార్థి స్కూలు ఫైనల్ పరీక్షలో ప్రథమ స్థానంలో ఉత్తీర్ణుడైనాడు. బృహస్పతి శాస్త్రి, బి.యస్.సి. గణిత, భౌతిక, రసాయన శాస్త్రాలతో పరీక్షలో విశ్వవిద్యాలయంలోనే ప్రథమ స్థానం పొందటంతో ఆనందసాగరంలో ఓల లాడిన తల్లిదండ్రులు అతనిని ఇంజనీరింగ్‌కు కానీ, ఎం.యస్సీకి గానీ పంపించాలని అనుకొన్నారు. జ్యోతిషశాస్త్రంలో అనితర సాధ్యమైన పాండిత్యం సంపాదించిన బృహస్పతి శాస్త్రికి దేవాలయ సందర్శనాల పట్లా, పూజాది కార్యక్రమాల పట్లా అధికమైన శ్రద్ధా భక్తులుండేవి. ఎం.యం.సి. చదివి ఏదో ఉద్యోగం చేయాలనిగానీ, రిసర్చి చేయాలనిగానీ ఆ విద్యార్థి రత్నానికి ఎటువంటి ఆలోచనా ఉండేదికాదు. కొడుకు అభీష్టానికి విరుద్ధంగా ఏపని చేయటానికీ ఆ తల్లిదండ్రులకు మనస్కరించేదికాదు.

ఆ విధంగా బృహస్పతి శాస్త్రి ఒక ప్రముఖ జ్యోతిష్య పండితునిగా, దేవీ ఉపాసకునిగా రూపొందటం జరిగింది. కానీ తన ఔన్నత్యాన్ని చూసి అతనెప్పుడూ అహంకారం చూపి ఎరుగడు. సర్వమానవులపట్లా ప్రేమతో, అభిమానంతో వ్యవహరించేవాడు. వినయానికి. మరో పేరు బృహస్పతి.

వారి భవిష్యవాణి ఎప్పుడూ తప్పిపోకుండా ఉండటం గురించి ఎవరైనా ఆయనతో ప్రస్తావిస్తే ''ఇదంతా దైవేచ్ఛ మాత్రమే, నాకిప్పుడు మంచిదశ నడుస్తూ ఉంది. అందువల్లనే

జెప్పేదంతా వాస్తవం కావచ్చు. నాదశ బాగా లేకపోతే, నేనేం జెప్పినా జరగకుండా ఉండవచ్చు. మనకు అనుకూల దశలో దైనందిన జీవితంలో మనంఎటువంటి శ్రద్ధా తీసుకోకపోయినా ఆరోగ్యం సవ్యంగా ఉంటుంది, కాలం అనుకూలంగా లేనప్పుడు ఎంత శ్రద్ధ తీసుకొన్నా ఆరోగ్యం సవ్యంగా ఉండకపోవచ్చు. దీనిపేరే దశమహిమ. కానీ ఇట్లా జరిగిపోతుందని అన్ని విషయాలను మనం దైవేచ్ఛకు వొదలగూడదు. దైవం చేసేపని దైవం చేసుకొంటుంది, మనం చేసేపని మనం చేసుకోవాలి అని ఆయన సమాధానం చెప్పాడు.

ప్రశ్న శాస్త్రంలో ఆయన గొప్ప సమర్థుడు తమ భవిష్యత్తు తెలుసుకోవాలనే ఆరాటంతో ప్రశ్నలడగటానికి వచ్చిన వాళ్ళంతా క్యూలో ఉండాలన్నదే ఆయన చేసిన ఏర్పాటు. ఆయన సమక్షంలో పెద్దా చిన్నాతేడాలేదు. ఇలా వచ్చే వాళ్ళు తమనోరు విప్పాల్సిన అవసరం గూడా ఉండేదికాదు. ఒక్కొక్కరి వంతు వచ్చినప్పుడు ఆవ్యక్తి శాస్త్రికి అభిముఖంగా కూర్చొంటాడు. తన ముందున్న చిన్న శంఖువుల రాశిపై శాస్త్రి తన అర చేతులను ప్రదక్షిణపజేసి, భవిష్యత్తు తెలుసుకోవటానికి వచ్చిన వారి మనసులోని ప్రశ్నను, దానికి తగ్గ సమాధానాన్ని, చేసుకోవాల్సిన పరిహారాన్ని కూడా ఆయన వివరిస్తాడు.

తమ ప్రశ్నకు తగ్గ ప్రత్యుత్తరాన్నీ తరుణోపాయాన్ని పొందినవారు శాస్త్రికి భక్తితో నమస్కరించి సంతృప్తితో వెళ్ళిపోతారు.

ఒకసారి ఒక పెద్ద పోలీస్ ఆఫీసర్ శాస్త్రివద్దకు వచ్చారు. ఆయన మనసులోని ప్రశ్నను గ్రహించి శాస్త్రి ''ఒక మంత్రి మిమ్మల్ని చాలా ఇబ్బంది పెడ్తున్నారు. బాధపడకండి, మీరు ఒక నెలలో కేంద్రప్రభుత్వానికి తిరిగి వెళ్తున్నారు. మీరు అక్కడికి వెళ్ళిన ఒక మాసంలోపలే ఇదే మంత్రివచ్చి మీ పాదాలమీద పడతాడు! అని చెప్పటం జరిగింది. తనను సంతోషపర్చటానికే శాస్త్రి ఇట్లా చెప్పాడనుకొంటూ ఆ ఆఫీసర్ చిన్నగా నవ్వుకొంటూ వెళ్ళిపోయాడు. కొద్ది రోజుల్లోనే ఆ పోలీస్ అధికారికి సి.బి.ఐకి డెప్యుటేషన్ రావటం జరిగింది; శాస్త్రి చెప్పినమాట రవ్వంతైనా తప్పిపోలేదు.

ముఖ పరిశీలనం చేసి అంటే మైండ్ రీడింగ్ చేసి శ్రీ శాస్త్రి ఏమోమో చెప్తారని కొందరు ఆరోపిస్తారు. కాని ఇది ఎంతమాత్రం వాస్తవం కాదు.

ఒకరోజు ఒక ముసలమ్మ ఆమె కూతురు, కూతురు కొడుకు ముగ్గురూ శాస్త్రి వద్దకు వచ్చారు. ''మీ ఇంట్లో ఒక చిన్న దొంగతనం జరిగింది. మీ ఇంట్లోని ఒక కుర్రవాడే ఆపని చేశాడన్న అనుమానం మీకొచ్చినందున అతను విషం తాగాడు. ఆ అబ్బాయి అమ్మమ్మకు కొద్దిగా వైద్యం తెల్సు కాబట్టి అతను బ్రతికి బట్టకట్టాడు. కానీ దొంగతనం

చేసింది మాత్రం అతనే'' అని శాస్త్రి తీర్పు చెప్పారు. అభిముఖంగా కూర్చొన్న ఆ అబ్బాయి ముఖం అధోముఖమైంది. ముగ్గురూ లేచి శాస్త్రికి నమస్కరించి బయటకు వెళ్ళారు.

వీళ్ళ తర్వాత వంతువచ్చిన మనిషికి ఒక అరవై ఏళ్ళు ఉంటాయి. ''మీ ప్రశ్న అంత చిక్కుతో కూడిందికాదు. మీ ఇంటి పెరట్లోని అరటి చెట్టుక్రింద ఒక పెద్ద గుడ్డు కనబడింది. మీ ఇంట్లో కోడి ఏదీ లేకపోవటంవల్ల ఎవరో క్షుద్రమంత్రం ప్రయోగించి దానిని అక్కడ పెట్టారన్న అనుమానం మీకు కలిగింది. మీ అనుమానం నిరాధారమైంది కాదు. దీనికి పరిహారం మాత్రం బహు సులభం. ఆ గుడ్డును తీసి బయట పారేస్తే ఏ సమస్యా ఉండదు'' సందేహ నివృత్తి జరిగిన ఆ వృద్ధుని వదనంలోని సంతోషం చెప్పనలవి కాదు.

ఇలాంటి అద్భుతమైన ఆయన పలుకులకు ఫేస్ రీడింగ్, మైండ్ రీడింగ్ అనే ఇంగ్లీషు పదాలుపెట్టి పిలవటం సమంజసమేనా?

జ్యోతిష్యశాస్త్రం అనేది అల్లాటప్పా విషయం కాదు; ఇది వేదాంగాలలో ఒకటి. జ్యోతిష్యశాస్త్రంలో తలపండిన వాళ్ళకు సరియైన సమయం, స్థలం చెప్పినప్పుడు, భూత భవిష్యత్ వర్తమాన విషయాలన్నింటినీ నిర్దుష్టంగా చెప్పగలుగుతారు. శతాబ్దాల పంచాంగాలను మనదేశపు జ్యోతిష్య పండితులు తయారుచేయలేదా? ఎన్నో ఏళ్ళనాడు వ్రాసిపెట్టిన పంచాంగాల్లో సూర్యచంద్ర గ్రహణాదుల సంభవ సమయంలో ఒక క్షణమైనా వ్యత్యాసం కనపడిందా? పాశ్చాత్యదేశాల్లో సూపర్ కంప్యూటర్లు వాడి శాస్త్రజ్ఞులు గణించిన గ్రహణ సమయాల్లో స్వల్పంగా వ్యత్యాసాలు ఉంటున్నాయి. వాళ్ళు వాటిని సరిదిద్దుకోవాలంటే మన పంచాంగాలే ఆధారం.

1990 జనవరి 24వ తేదీ. జ్యోతిష్యశాస్త్రంలో విశ్వాసం ఉన్న కొంతమంది మిత్రులలో కొంత ఆందోళనగా శాస్త్రి ఒక విషయాన్ని ప్రస్తావించాడు... రాబోయే అయిదు సంవత్సరాలలో గురువుకు చెప్పుదెబ్బలు తగలబోతున్నాయి... ఆ వివరాలనే లెఖ్కలు కడుతున్నాను... ''ఏ గురువుకు ఆ దెబ్బలు శాస్త్రిగారూ?'' అని వాళ్ళు ప్రశ్నించారు.

''ఈ లోకంలోని ఏ గురువు గూర్చి నేను చెప్పటం లేదు. పరమగురువు సాక్షాత్ బృహస్పతి, గురు గ్రహం గూర్చే నేను చెప్తున్నాను'' అని శాస్త్రి విశదీకరించాడు.

''గ్రహాలన్నింటిలోకి పరిమాణంలోనూ, ప్రాముఖ్యతలోనూ గురుత్వమున్నది గురుగ్రహానికే కదా!'' అప్పుడప్పుడు దీనిని బృహస్పతి, గ్రహస్పతి అనిపిల్చినా తప్పులేదంటారు శాస్త్రిగారు తమాషాగా. గ్రహాలలో అగ్రస్థానం వహిస్తున్న బృహస్పతి

నామం తనకు పెట్టటానికి, తనతల్లిదండ్రుల జ్ఞానంగాని అజ్ఞానంగాని కారణం కాదనీ, తన జన్మ సమయంలోని గ్రహస్థితి మూలంగానే తనకీ పేరు వచ్చిందని శాస్త్రి విశ్వసిస్తున్నాడు. జ్యోతిష్యశాస్త్రంలో తనకిప్పటి వరకూ లభించిన ప్రావీణ్యతకు హేతువు ఆ అతి దివ్య గోళమేనని గూడా ఆయన నమ్ముతున్నాడు. ఒక మానవునికి గురుస్థానం ప్రసాదించటానికి ఆ గురువుకు మాత్రమే శక్తి ఉన్నదని ఆయన నిశ్చిత అభిప్రాయం. ఈ కారణాలవల్లనే బృహస్పతికి కలగబోతున్న ఆ ఘాతాలగూర్చి ఆయన ఆవేదన చెందేది.

ఆరు నెలల్లో బృహస్పతి గ్రహానికి సంభవించబోతున్న గ్రహపీడ గూర్చి శాస్త్రి చేస్తున్న అధ్యయనం, పరిశోధనం, అన్వేషణం అంతా పూర్తయింది.

1994 జులైనెలలో 17 నుండి 22వ తేదీవరకు దుర్మార్గుడైన ఒక ధూమకేతువు యొక్క ఇరవై ఒక్క శకలాలు తన గురువైన గురువుకు క్షతములు కల్గిస్తాయని భవిష్యత్ సూచన చేస్తుండగా శాస్త్రి నయనాలు సజలాలైనాయా?... ఆయన కంఠం గాద్గదికమైందా?... ఆయన హృదయస్పందన అధికమైందా?

ఆ ధూమకేతువుకు తాను పెట్టిన పేరు ''పాదుక కృత్'' అని తెలిపారు శాస్త్రి. దాని అర్థమేమిటని ప్రశ్నించగా ''ఆ ధూమకేతువు చేయగలిగిందేమిటి? మహా అయితే గురువు చర్మాన్ని గీరగలడు. చర్మం గీసేవాడు చర్మకారుడు కాక వేరే ఏమవుతాడు?'' అని శాస్త్రి వివరించటం జరిగింది. ఆ దివ్య గ్రహానికేమీ జరగదు. ఇటువంటి సహస్ర ధూమకేతువులు వచ్చిపడినా నా గురుదేవునికి ఎలాంటి హానీ కలుగదు. ఈ విషయంలో మానవమాత్రులమైన మనం చేయగలిగిందేమీ లేదు. అయినా గాని మనం చేతులు ముడుచుకొని కూర్చోవచ్చా? విశ్వశాంతికోసం మేము పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లుగానే, గురువు రక్షణకు అవసరమయ్యే కొన్ని పూజా విధులనుగూడా నేను నిర్వహిస్తున్నాను; అవి ధూమకేతువు పతనమయ్యేంతవరకూ యధావిధిగా నిత్యం కొనసాగుతాయి. అల్పజీవి ఉడుత గూడా సత్కార్మల్లో తనవంతు పాత్రను తాను నిర్వహించింది కదా!

పూజలు, జపాలు, హోమాలు అన్నీ సక్రమంగా సాగిపోతున్నాయి. ఏ పరిస్థితుల్లోనూ చలించని, ఏ విషయానికీ భయపడని, దైవ నిర్ణయాలపట్ల అచంచల విశ్వాసంగల శాస్త్రి ముఖంలో రోజురోజుకూ స్వల్పంగా విషాదఛాయ... ఉత్కంఠ అనే కారుమేఘం కమ్ముకోసాగాయి. సామాన్యంగా ఆయన చిరునవ్వులో దర్శనమిచ్చే జ్యోత్స్న రేఖలు కనుమరుగైపోయాయి. దీనిగూర్చి ఆయన శిష్యబృందానికి ఆవేదనగానూ, అయోమయంగానూ ఉండేది. గొంతులో కఫం అడ్డుపడ్డందువల్ల వల్లమాలిన బాధ కలగటం, ఎన్ని మందులు వాడినా వదలకుండా ఆయనను పీడిస్తున్న దగ్గు తగ్గకపోవటం శాస్త్రి ఆరాధకులకు ఎంతో వ్యధ కల్గించింది.

శాస్త్రి భవిష్యత్‌వాణి ప్రకారంగా జూలై 17న ఆ ధూమకేతు శకలాలు గురువును వచ్చి ఢీకొంటాయి. దీనికి ఒకరోజు ముందు రాత్రివేళ శాస్త్రికి విపరీతమైన జ్వరం వచ్చింది. కొంతమంది శిష్యులు నిద్రమాని ఆయన వద్దనే కూర్చొన్నారు. డాక్టర్ చెప్పిన ప్రకారంగా మందులుగూడా సమయానికి ఆయనకు ఇవ్వటం జరిగింది. ప్రత్యూషకాలంలో ఒళ్ళంతా చెమట పట్టటంతోపాటు, గుండె నొప్పిగూడా రావటంతో ఆయనను స్థానికంగా ఉన్న హార్ట్ స్పెషలిస్టు క్లినిక్‌లో చేర్చటం జరిగింది.

శాస్త్రి పరిస్థితినంతా హార్ట్ స్పెషలిస్టు డాక్టర్ సోమేశ్వరరావు ప్రత్యేక శ్రద్ధతో పర్యవేక్షించసాగాడు. శాస్త్రిని ఐ.సి.సి.యులో మూడురోజులు ఉంచారు. శాస్త్రి అడ్మిట్ అయిన నలభై ఎనిమిది గంటలు గడిచిపోయిన తర్వాతనే డా. సోమేశ్వరరావు మనసు నిమ్మళించింది. మూడు రోజులు గడచిన తర్వాత శాస్త్రి ప్రమాద స్థితినుండి బయటపడినట్లు డాక్టర్ సంతోషంగా తెలియజేశారు. రెండు రోజులనుండీ వార్తా పత్రికలు కావాలని వత్తిడి చేసిన శాస్త్రికి నాలుగవరోజు పాతవీ, కొత్తవీ కలిపి అన్ని పత్రికలు ఇచ్చారు. ఆ పత్రికలన్నింటినీ చూసిన శాస్త్రి ముఖంలో ప్రశాంతతతోపాటు దరహాసంగూడా గోచరించింది. ఆరో రోజు శాస్త్రి ఇంటికి తిరిగి వచ్చాడు. ఒక మాసంపాటు ఆయన పూర్తి విశ్రాంతి తీసుకోవాలని డాక్టర్‌గట్టిగా చెప్పటమేగాక, రోజుకు రెండుసార్లు స్వయంగా వచ్చి శాస్త్రి ఆరోగ్య స్థితిని పరిశీలించేవాడు. కొద్ది రోజుల్లోనే ఆయన పూర్వపు ఆరోగ్యస్థితిని పొందినట్లు శిష్యులకనిపించింది. ఎంతో ఉల్లాసంగా, ఉత్సాహంగా కన్పిస్తున్నారాయన.

ఒకరోజు తన సన్నిహిత శిష్యులతో వివిధ విషయాలపై సుదీర్ఘంగా చర్చించారు శాస్త్రి. గురుగ్రహానికి సంభవించిన ప్రహారాలగూర్చి, ఈ విఘాతం జరిగేముందు తను పడ్డ వేదన గూర్చి ఆయన చిరునవ్వుతో చెప్తూ ఈ విధంగా అడిగారు. ''ఈ మధ్యన నాలో అహంకారం పెరిగినట్లుంది కదూ?''

''అయ్యో... ఇట్లా అంటున్నారేమిటి గురువుగారూ?'' విషాదంతో అన్నారు శిష్యులు.

''మరింకేమిటి? నా గూర్చి నేను అంత గొప్పగా భావించవచ్చునా? గురుగ్రహానికి ఏదో చిన్న తాకిడి జరగబోతున్నదని నాకు స్ఫురించటం, ఆవిధంగానే సంభవించటం అదంతా వాస్తవమే. నాలాగే మరెందరో ఈ సంగతిని తెల్సుకొని ఉంటారు. పాశ్చాత్యదేశాల్లో కొందరు శాస్త్రజ్ఞులు దీనిని చాలా ఖచ్చితంగా ముందే అంచనా వేశారు. వాళ్ళదృష్టి ఈ విషయాన్ని అవలోకించటానికీ, అధ్యయనం చేయటానికీ పరిమితమైంది. కాని నేనో?... గురుగ్రహాన్ని

ఆపదనుండి రక్షించటానికి ఎన్నో పూజలూ, పునస్కారాలూ ఎంతో కాలం జరిపించాను. ఇది నా అవివేకం వల్లనా? అహంకారం వల్లనా? ఆదేశాల్లో గురుగ్రహాన్ని రక్షించాలన్న ఆలోచన కనీసం ఒక్క శాస్త్రజ్ఞుని మదిలోనైనా మెదిలిందా? జరగబోయే సంఘటనను క్షణాలతో సహా తూచా తప్పకుండా చెప్పటం జరిగింది... ఆ దృశ్యాల ఛాయాచిత్రాలనుగూడా వాళ్ళు తీశారు గదా! అంతటి సామర్థ్యం కలిగి ఉన్నా, గురుగ్రహానికి జరగబోయే ప్రహారాలను తప్పించటానికిగానీ, కనీసం వాటి తీవ్రతను తగ్గించటానికి గానీ వాళ్ళు ఎట్టి ప్రయత్నం చేయకపోగా, కనీసం ఆలోచించనైనా లేదు. వాళ్ళెంత అహంకార రహితులు! గురువుకు తోడ్పడటానికి నాకు శక్తి ఉన్నదని నేను భావించటం కేవలం నా అహంకారమే కదా! అజ్ఞానమేకదా! మూఢత్వమే కదా! మానవమాత్రులమైన మనం మనశక్తి ఎంతటిదో తెల్సుకొని మసలాలి. దైవం అంటే ఏమిటో, ఎవరో అవగాహన చేసుకోకుండా సర్వశక్తివంతుడైన ఆ భగవంతుణ్ణి పరిరక్షించే బాధ్యతను మన భుజాలపైన వేసుకోవటం, అందుకు తగ్గ ప్రయత్నాలు చేయటం మన మూర్ఖత్వాన్ని సూచిస్తుంది. మతం పేరుతో ఎన్ని యుద్ధాలు ఈలోకంలో జరిగినై? మతకలహాలు ఈ రోజుకూ జరగటంలేదా? ఒక గుడి ప్రాంగణంలోకి ఎవరైనా మాంసాన్ని విసిరివేస్తే, అది గోమాంసమని ఆరోపిస్తూ హిందువులు కల్లోలాలు రేపుతారు. ఈ మాంసం ముక్కలే మసీదులో పడితే అవి పందికి చెందినవని ముస్లింలు అలజడి రేపుతారు. ఈ విధంగా ఆరంభమయ్యే మతకల్లోలాల్లో ఎంతోమంది అమాయకులైన వ్యక్తులు కన్నుమూస్తారు... ఎంతమంది క్షతగాత్రులవుతారు? ఎన్నెన్ని భవనాలు అగ్నికి ఆహుతైపోతాయి?... ఎంతమందికి దారుణమైన కష్టనష్టాలు సంభవిస్తాయి? ఇంతటి హింసా కాండకు మానవులెందుకు పాల్పడుతున్నారు? కేవలం మతం పేరుతోనేగదా! అంటే తమ దైవ రక్షణ కొరకన్నమాట! దేవాలయ రక్షణ నెపంతో మనుషులు సాటి మనుషుల్నే చంపుతున్నారు. సకల చరాచర సృష్టిస్థితి సంహార కారకుడైన ఆ లోకాధిపతికే తన ఆలయాల రక్షణ సాధ్యం కావటం లేదు; వాస్తవమే. ఒక్క భగవంతుడికి విశ్వవ్యాప్తంగా ఉన్న కోట్లాది ఆలయాలన్నింటినీ సంరక్షించుకోవటం సాధ్యమయ్యే పనేనా? దేవుని పేరు చెప్పుకొని ఇన్ని ఆలయాలను మానవులు నిర్మిస్తే వాటన్నింటికీ కాపలా కాస్తూ కూర్చోవటానికి దేవునికేమైనా పిచ్చి పట్టిందా? ఒక్కో మనిషి ఒక్కో గుడి నిర్మిస్తే వాటన్నింటిలో దేవుడు వచ్చి నివాసం ఏర్పర్చుకోవాలా? దేవుడు నివసించాల్సింది మానవుల మనసుల్లో. మానవులందరిలో దైవత్వం వికసించాలి. తనలోనే ఉన్న దైవాంశని తెల్సుకోకుండా ఈ మానవులెందుకు దయ్యాలుగా మారిపోతున్నారు? దానవ కృత్యాలెందుకు చేస్తున్నారు?

ఇంతటి అవగాహన ఉన్న నేను చేసిందేమిటి? బృహస్పతి శాస్త్రిగా పిలువబడే నేను బృహస్పతి గ్రహ రక్షకుడినైనానా? ప్రతిక్షణం ఎన్నో తోక చుక్కలు పుడమిని ఢీకొంటున్నాయి. అవి వచ్చి వసుధపై పడేముందు వాటిని భస్మం చేసే శక్తి మన అంతరిక్షానికుంది. అయినా కొన్ని అవశేషాలు పృధ్విపై పడుతున్నాయి. అటువంటి అవశేషమైన ఒక పెద్దరాయి లండన్ ''హైడ్ పార్క్'' లో ఇప్పటికీ ఉంది. ఇక్కడేకాదు; సకల గ్రహాల్లో, నక్షత్రాల్లో వాటివాటి గురుత్వాకర్షణ శక్తిమూలంగా ఇట్లా తోకచుక్క శకలాలు వచ్చిపడటం సర్వసాధారణమే. ఇప్పుడు గురుగ్రహంమీద పడ్డ ఇరవై ఒక్క శకలాలవల్ల ఆ గ్రహానికి వచ్చిన ఆపద ఏంలేదు. రాదు గూడా; గురుగ్రహ పరిభ్రమణ మార్గంలో ఎటువంటి వ్యత్యాసం ఏర్పడలేదు. కానీ, శాస్త్రాధ్యయనంవల్ల నాకు లభించిన జ్ఞానాన్ని, కొద్దిగానైనా పరిగణనలోకి తీసుకోకుండా జ్యోతిష్యశాస్త్రం ద్వారా లభించిన సంకేతాల్ని మాత్రమే ఆధారం చేసుకొని నేను అనవసరంగా ఆవేదన చెందాను. ఎన్నో అర్చనలు చేశాను. గురువును రక్షించాలని నేను ప్రయత్నించటం, గురుశక్తిని గ్రహించలేకపోవటం వల్లనేగదా! ఈ గ్రహంలో స్వల్ప పిపీలకంవంటి నేను, సౌరమండలంలోనే అగ్రగణ్యుడైన ఆ బృహత్ గ్రహరాజును సంరక్షించటానికి సర్వలోకాధిపతికి నివేదన చేయటమా! ఎంత అజ్ఞానం! ఇట్లా వ్యర్థంగా బాధపడి బాధపడి నాకు నేనే ఈ హృద్రోగాన్ని తెచ్చుకొన్నాను. లేకపోతే నా అజ్ఞానాహంకారాలకు ఆ దైవం విధించిన శిక్షయేమో ఇది?